# ముడి ఎడమైతే ...

'నా పెంపుడు నక్షత్రాలు ఎగిరి పారిపోయి నీ సిగలో దాక్కున్నాయి. వాటిని ఇచ్చేస్తావా?' అని సుందరమ్మ కుడికన్నీటికన్నను అడిగాడు సూర్యం.

అతడు అలా అడిగిఉండేవాడు కాడు. అయినా అడగవలసి వచ్చింది, వేసవికాలంలోని చల్లనిరాత్రి– మల్లెపందిరికింది చక్కని క్రీనీడ–మబ్బులగుడ్డలోంచి వడబోసిన వెన్నెల పానీయం– మసక వెలుతురులో కూడా మిలమిలలాడుతున్న కొబ్బరాకుల గలగల–అన్నీ కలసి అతడిని అడిగించాయి. అతడు అడిగాడు; అడిగిన వెంటనే కనుమొరగాడు.

సుందరమ్మ కుడికన్నీటికన్ను దిక్కులు కలయబార చూసింది. నిట్టూర్పువిడిచింది. 'ను వ్వెక్కడ? ను వ్వెక్కడ!' అని ఘోషించింది. ఆకాశం జవాబుచెప్తుందా? ఆ యింటి నూయి జవాబు చెప్తుందా?

ఉత్సాహాన్నే ఊపిరిపీలుస్తూ. ఉద్రేకాన్ని మతాబు ఫూటలా భోంచేస్తూ, కళ్ళల్లో కవిత్వం, కరాలలో కరెంటు, పెచ్చు పెరిగిన ఆవేశాన్నే ఖర్చుపెట్టుకొంటూ, కాలేజీలో చదువుకునే రోజుల్లో కలిశాడు సూర్యం, సుందరమ్మ ఎడమ కంటి తోడిమపిటాడి ఎదిగీ ఎదగని ప్రేమని. అప్పటికి ఆమె వయస్సు ఇరవై ఒకటి. ఆమె యౌవనం వయసు ఆరేళ్ళు.

సూర్యానికి సుందరమ్మను పరిచయం చేసింది సుబ్బారావు సముద్రతీరంలో నురుగుని, సైకిల్ రిక్షా పరుగునీ సరి

సమానమైన కవితాదృక్పథంతోనే చూడగలిగినవాడు సుబ్బారావు. చుక్కలని లెక్కించి, సూర్యుణ్ని వలలో పట్టుకుందామని, వానని భయపెడదామని, కొండలని మచ్చికచేసుకుందామని, ఇంకా ఎన్నెన్నో చేద్దామనీ చూద్దామనీ ఉవ్విళ్ళూరుతూ ఉండేవాడు అతడు సుబ్బారావూ సూర్యం ఒకే ఈడువాళ్ళు ఒకేక్లాసులో చదువుకొని ఒకేగ్లాసుతో మంచినీళ్ళుతాగే స్నేహితులు వాళ్ళు.

సూర్యం సుందరమ్మా ఒక నొకరు తెలుసుకొని ఒకళ్ళ హృదయాలు ఇంకొకళ్ళు తొలచుకొని వలచుకొని ఒక్కటవటానికి ముందుగా, ఒకవాన కురుస్తున్న వేళ ఒక పంచకింద తలదాచుకొని ఒరసుకొని ఒణుకుతూ సుబ్బారావు సుందరి ఎడమకంటితో యథాలాపంగా 'వెలుతురని శిక్షించడం నాకు ఇష్టం' అన్నాడు. 'అలా ఇష్టపడేవాళ్ళంటే నాకు ఇష్టం' అన్నది సుందరమ్మ, ఏదో జవాబు చెప్పాలి కాబట్టి. ఇద్దరూ ఒకేవానలో తడవడానికి, ఒకేపంచ చేరడానికి కారణాలు దైవికం కావు. స్వయంకృతాలే. రెండు వాన చినుకులు ఆమె ముంగురులమీద పడి చెక్కిళ్ళపైన రాలాయి. అవి ముత్యాలవలె మెరుస్తూ సత్యాలవలె అరుస్తూ అతడికి కనబడ్డాయి.

అంతట కొంతకాలానికి ఆ రెండుచినుకులే అతడి మీద ఆమె చెక్కిళ్ళనుండి జారిపడ్డాయి. అవి కన్నీళ్ళు కావనుకొన్నాడు, సుబ్బారావు. ఇంతలో సూర్యం ధైర్యం తెచ్చుకుని సుందరమ్మ ఎడమకంటిని ఎగాదిగా చూడ్డం మొదలెట్టాడు.

సుబ్బారావు మితభాషి. సూర్యంయొక్క హితైషి. కళాశాల మూసేటప్పుడు, చంద్రు డుదయించేటప్పుడు, గాలిలో ప్రేమగీతాలను రేడియో వెదజల్లేటప్పుడు, సూర్యం సుందరమ్మను ప్రేమించేటప్పుడు సుబ్బారావు ఎన్నికల ప్రచారంలో నిజంలాగ ఎక్కడా కనబడేవాడు కాదు.

ఆ ఘడియలోనే సుందరమ్మ కుడికన్నీటికన్ను పుట్టింది.

ఆ ఘడియలను తలచుకొంటూనే అది పెరిగింది, పెద్దయింది.

వెలుతురిని శిక్షించే సుబ్బారావు చీకటిలోకి ఎందుకు నిష్క్రమించాడో ఆమెకి అర్థంకాలేదు. వెయ్యి ప్రశ్నలకు ఒక్కజవాబూ లేరాదు. వందపిలుపులకి ఒక్క సమాధానం రాలేదు. పది ఉత్తరాలకి ఒక్క ప్రత్యుత్తరం లేదు. సుందరమ్మ కన్నీటికన్ను శూన్యంలోకి చూస్తూ, అన్యం దర్శించడం మానేసింది.

ఒక మామిడాకులు కట్టిన ఇంట్లో, ఒక అరటిచెట్లు కట్టిన పందిటిలో, ఒక పసుపుబొట్లు పెట్టినపీటమీద జీలకర్రా బెల్లం పెట్టిన చేతికి ప్రాణమై పోయింది, సుందరమ్మ ఎడమ కన్ను.

ఆచేయి సూర్యానిది.

ఆప్రాణం కృపాణం.

ఆ దుర్ముహూర్తంలో, ఆ అపజయ దుందుభుల మ్రోతలో, ఆ లోగిట్లో సుబ్బారావుకూడా ఉన్నాడు.

అతడిని చూస్తూ అతడికి అంకితమైపోయింది, ఆమె కుడి కన్ను.

'నేను నిన్ను ప్రేమిస్తున్నాను సూర్యం! నిన్ను విడిచి బతకలేను. నిన్ను మరచి ఉండబోను' అని ఆమె ఎడమ కన్ను అంటున్నప్పుడే 'నిన్ను నేను సహించలేను. నీ ప్రేమ భారాన్ని వహించలేను' అని ఆమె కుడికన్నీటికన్ను అంటూనే ఉండేది. అయితే నీళ్ళలోని ఉదజని కంటికి కనబడనట్టు ఆ కుడికంటిభాష వినబడేది కాదు.

విమానాలు కూలాయి. అనుమానాలు రేగాయి. రైళ్ళు ఢీకొన్నాయి, జైళ్ళు లేచాయి. పరవళ్ళుతొక్కాయి. అణువు పగిలింది. ఇదంతా సుబ్బారావుగుండెలోనే.

అతడు ఉండబట్టలేక ఈ వేసవి కాలంలోని చల్లని రాత్రివేళ, ఈ మల్లెపందిరికింది చక్కని క్రీనీడలో ఈ మసక వెలుతురులోకూడా మిలమిలలాడే కొబ్బరాకుల గలగలలో సుందరమ్మని కలుసుకొని 'నేను వెలుతురిని శిక్షించుదామనుకొన్నానుగాని, చీకటినుండి నన్ను నేను రక్షించుకోలేకపోతున్నాను' అన్నాడు.

'నేనుకూడా అదే స్థితిలో ఉన్నాను సుబ్బారావ్! నేను అసహాయను!' అంది సుందరమ్మ.

ఆమాటలు సూర్యం నూతిగోడచాటున నిలబడి విన్నాడు. అప్పుడు అతనికళ్ళలోంచి రెండు నక్షత్రాలు పారిపోయి సుందరమ్మదగ్గరికి చేరుకొన్నాయి.

సుబ్బారావు వెళ్ళిపోయాడు.

సూర్యం అక్కడికొచ్చాడు. 'అయితే నాకెందుకు చెప్పలేదు?' అని అడిగాడు. సుందరమ్మ ఏం జవాబు చెపుతుంది. ఆమె కుడికన్నీటికన్ను అతడి పాదాలముందు వాలింది. ఎడమకన్ను ఏదిక్కువైపు సుబ్బారావు వెళ్ళాడో' దానికి అంకితం అయిపోయింది.

అప్పుడు తన పెంపుడు నక్షత్రాలని ఇచ్చెయ్యమని సుబ్బారావు అడిగాడు.

ఎందుచేతంటే?

సుబ్బారావు సూర్యం వయసుకి ఒక ఈడువాళ్ళైనా వరసకీ, వావికీ తండ్రీకొడుకులు.

సూర్యం చిన్నాన్న సుబ్బారావు!